## సినిమా టికెట్లపై 'కోమటిరెడ్డి' యూ-టర్న్

**విశ్వంభర తెలంగాణ బ్యూరో:** సినిమా టికెట్ ధరల పెంపు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట మార్చారు. తాను సినీ పరిశ్రమ గురించి పట్టించుకోవడమే మానేశానని టికెట్ ధరల పెంపు గురించి వస్తున్న జీవోలకు తనకు ఎలాంటి సంబంధం లేదని సంచలన వ్యాఖ్యలు చేసిన మంత్రి సోమవారం అందుకు భిన్నంగా మాట్లాడారు. టికెట్ ధరల పెంపు నిర్ణయం ప్రభుత్వం సమిష్టిగా తీసుకున్నదేనని వెల్లడించారు.

**షరతులతో కూడిన పెంపు..**

ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. గతంలో పుష్ప 2 ఘటన తర్వాత ధరల పెంపు ఉండదని ప్రకటించినప్పటికీ, పరిశ్రమ ప్రయోజనాల దృష్ట్యా ఆ నిర్ణయాన్ని సవరించుకున్నట్లు తెలిపారు. అయితే, పెంచిన ధరలో 20 శాతం సినీ కార్మికుల సంక్షేమ నిధికి కేటాయించాలనే కఠినమైన షరతును విధించినట్లు పేర్కొన్నారు. ఇటీవల కొన్ని సినిమాల విషయంలో కోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసిన సమయంలో తాను నగరంలో లేనందువల్ల పూర్తి సమాచారం అందలేదని వివరణ ఇచ్చారు.

**మాకు పని ఉంది.. మీకు లేదు**

మంత్రికి తెలియకుండానే జీవోలు ఎలా వస్తాయని ఎద్దేవా చేసిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క ఎంపీ సీటు కూడా గెలవలేకపోయిన వారికి తమ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ బొక్కాబోర్లా పడిందన్నారు. బీఆర్ఎస్ నేతలకు పనిపాట లేదు కాబట్టే ప్రతి విషయంలోనూ బురదజల్లుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల కోసం చేయాల్సిన పని చాలా ఉందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రుల శాఖల్లో జోక్యం చేసుకోరని వైఎస్ఆర్ మాదిరిగా అందరిని కలుపుకుపోతారని చెప్పారు.

ఆయా శాఖల విషయంలో ముఖ్యమంత్రి జోక్యంపై వస్తున్న ఆరోపణలను మంత్రి తోసిపుచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ శాఖలోనూ అనవసరంగా తలదూర్చరని, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి లాగా మంత్రులకు పూర్తి 'ఫ్రీ హ్యాండ్' ఇస్తారని కొనియాడారు. ప్రభుత్వం పారదర్శకంగా ఉందని, విపక్షాల విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇటీవల తన నిర్ణయాలను మార్చుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. మొదట తాను ఆ శాఖను పట్టించుకోవడం మానేశాను అని చెప్పి, ఇప్పుడు అంతా కూర్చుని చర్చించాం అనడం చర్చనీయాంశమైంది.

## స్వామి వివేకానందకి ఘన నివాళులు

**విశ్వంభర, రంగారెడ్డి కోర్ట్ :** భారతదేశ ఔన్నత్యాన్ని దశదిశలా చాటిచెప్పిన మహోన్నత మూర్తి, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రముఖ చిత్రకారుడు మల్లేష కార్యక్రమంలో పాల్గొన్నారు. సంఘసంస్కర్తలు ఆడవారి హక్కుల కోసం అత్యాచారాలపై ఖండిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## న్యూ నందిహిల్స్ ఈస్ట్ గౌరవ అధ్యకులుగా కృష్ణారెడ్డి




**విశ్వంభర, మీర్‌పేట్ :** న్యూ నంది హిల్స్ ఈస్ట్ కాలనీ అసోసియేషన్ రోడ్ నెంబర్ 18 నుండి 24 వరకు ఏర్పడింది. మంగళ వారం జరిగిన కార్యక్రమంలో కాలనీ రెసిడెంట్స్ న్యూ నందిహిల్స్ ఈస్ట్ గౌరవ అధ్యకులుగా కృష్ణారెడ్డి, ప్రెసిడెంట్ గా కడపర్తి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా కిషన్ నాయక్, వైస్ ప్రెసిడెంట్లు గా నగేష్, రాంరెడ్డి, నరసింహ రావు, అర్జున్ రావు, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా సివి రమణారావు, సురేష్ రావు ఉమెన్ వైస్ ప్రెసిడెంట్ రుక్మిణి, జనరల్ సెక్రెటరీగా సింగం రాజు, ఉమెన్ సెక్రటరీగా చంద్రకళ, సెక్రెటరీలుగా వెంకటస్వామి, బక్కయ్య, అశోక్ రెడ్డి, కోశాధికారిగా బహుమతి రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా ఎం రవీందర్ రెడ్డి, మధుసాగర్ ,లక్ష్మణ్ నాయక్, సైదులు, కృష్ణ, సంతోష్, గంగాధర్, దివాకర్ రెడ్డి, నాగాచారి, గోపి కిషన్, రవి, సలహాదారు గా రాజేశ్వరరావు ల ని ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు .

## ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** సంక్రాంతి సంబరాలలో భాగంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్య వైశ్య సంఘము అధ్యక్షుడు కొత్త రవి ఆధ్వర్యంలో ఎల్బీనగర్లో నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమం కు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా దయానంద్ గుప్తా మాట్లాడుతూ.. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంతో ఉత్సాహంతో రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి పండుగ వైభవాన్ని మరింత పెంచారు అని అన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతీ మహిళకు కన్సలేషన్ బహుమతులు ఇవ్వడం జరిగింది అధ్యక్షుడు కొత్త రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమ్మానాన్నలను కాదంటే జీతంలో కోత

- కొత్త చట్టానికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం
- నేరుగా వారి ఖాతాల్లోకే '10-15 శాతం' నగదు జమ..



**విశ్వంభర, బ్యూరో :** అమ్మానాన్నలను కాదనుకుని, వృద్ధాప్యంలో వారిని కంటికి రెప్పలా చూసుకోని ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. తమ రక్తాన్ని చెమటగా మార్చి పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చిన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. అటువంటి ఉద్యోగుల నెలవారీ వేతనం నుంచి 10 నుంచి 15 శాతం మొత్తాన్ని కోత విధించి, నేరుగా వారి తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా కొత్త చట్టాన్ని తీసుకురానున్నట్లు ఆయన సంచలన ప్రకటన చేశారు.

హైదరాబాద్‌లోని శిల్పాకళా వేదికలో కొత్తగా ఎంపికైన గ్రూప్ 2 అధికారులకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమంలో సీఎం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగికి ప్రతి నెల ఒకటో తేదీన జీతం ఎలా పడుతుందో, వారి తల్లిదండ్రులకు కూడా అదే రోజున నిర్ణీత మొత్తం (1015%) వారి ఖాతాల్లో జమైపోతుందన్నారు. ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలు, నిబంధనలను రూపొందించే బాధ్యతను కొత్తగా విధుల్లో చేరుతున్న అధికారులకే అప్పగిస్తున్నట్లు సీఎం తెలిపారు. దీనిపై తక్షణమే కసరత్తు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

**కొడుకైనా, కూతురైనా బాధ్యత తప్పదు..**

తల్లిదండ్రుల పట్ల బాధ్యత కేవలం కుమారులకే కాదని, కుమార్తెలకు కూడా ఉంటుందని సీఎం గుర్తుచేశారు. "పెళ్లయ్యాక ఆడపిల్లలకు అత్తగారి ఇల్లు ఎంత ముఖ్యమో, పుట్టినిల్లు కూడా అంతే ముఖ్యం. కొడుకులకు కట్నాలు, కార్లు రావచ్చు.. కానీ కన్నవారిని రోడ్డున పడేయడం క్షమార్హం కాదు" అని ఆయన ఉద్వేగంగా మాట్లాడారు. తాము కేవలం శిక్షించడం కోసం కాకుండా, సమాజంలో నైతిక విలువలను కాపాడటం కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. మీరు ఈ రోజు అధికారి కుర్చీలో కూర్చున్నారంటే దానికి కారణం మీ తల్లిదండ్రుల త్యాగమేనని, ఆ వేళ్లను మరిచిపోవద్దని.. మీ దగ్గరకు వచ్చే పేద ప్రజల్లోనూ మీ తల్లిదండ్రులను చూసుకోవాలన్నారు.

## ఆల్-న్యూ కియా సెల్టోస్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్ :** కొత్త తరం ఎస్‌యూవీ కొనుగోలుదారుల కోసం రూపొందించిన ఆల్‌న్యూ కియా సెల్టోస్, ఈ బ్రాండ్ న్యూ సెల్టోస్ ను తెలంగాణ ప్రభుత్వ రవాణా శాఖ గౌరవ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, ప్రోస్పెరా కియా మేనేజింగ్ డైరెక్టర్ సిరాజుద్దీన్ బాబు ఖాన్, వైబ్రెంట్ మొబిలిటీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ బషీరుద్దీన్ బాబు ఖాన్‌తో కలిసి ఆవిష్కరించారు. డిజైన్, స్థలం, భద్రత మరియు సాంకేతికతలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ మిడ్‌సైజ్ ఎస్‌యువి విభాగంలో బెంచ్‌మార్క్‌ను తిరిగి నిర్వచిస్తోంది.

నెక్స్‌జెన్ డిజిటల్ అనుభవం: సెగ్మెంట్‌బెస్ట్ 75.18 సెం.మీ (30ఇంచ్) ట్రినిటీ పానోరమిక్ డిస్‌ప్లే ప్యానల్, ప్రీమియం బోస్ 8స్పీకర్ ఆడియోతో మరింత రిచ్ ఇన్‌కార్ అనుభవం

కొత్త ప్లాట్‌ఫాం: ఇండియాఫస్ట్ గ్లోబల్ K3 ప్లాట్‌ఫాం - మెరుగైన భద్రత మరియు డ్రైవింగ్ రిఫైన్‌మెంట్ అధునాతన భద్రత & ఇంటెలిజెంట్ డ్రైవ్: ఎడాస్ లెవల్ 2తో 21 ఆటోనమస్ ఫీచర్లు, అలాగే బలమైన 24 స్టాండర్డ్ సేఫ్టీ ప్యాక్.

కియా డిజైన్ లీడర్‌షిప్, ఆధునిక భద్రత మరియు ప్రోగ్రెసివ్ టెక్నాలజీ పట్ల కియా నిబద్ధతను మరింత బలపరుస్తూ, ఆల్‌న్యూ కియా సెల్టోస్ ను ₹10.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్) ప్రారంభ ధరతో అందుబాటులోకి తీసుకువచ్చింది.

కియా గ్లోబల్ K3 ప్లాట్‌ఫాంపై (ఇండియాలో తొలిసారి) నిర్మితమైన ఆల్‌న్యూ కియా సెల్టోస్, పరిమాణం, నైపుణ్యం మరియు సామర్థ్యంలో స్పష్టమైన అభివృద్ధిని ప్రతిబింబిస్తుంది. 4,460 మిమీ పొడవు, 1,830 మిమీ వెడల్పు, 2,690 మిమీ వీల్‌బేస్‌తో మెరుగైన రోడ్ ప్రెజెన్స్, విశాలమైన కేబిన్, స్థిరమైన రైడ్‌ను అందిస్తూ మిడ్SUV విభాగంలో తన బెంచ్‌మార్క్ స్థానాన్ని మరింత బలపరుస్తోంది.

ఈ సందర్భంగా కియా ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్ & మార్కెటింగ్) అతుల్ సూద్ మాట్లాడుతూ.., "ఆల్‌న్యూ కియా సెల్టోస్ భారత మార్కెట్‌కు గ్లోబల్‌గా పోటీగల, కస్టమర్‌సెంట్రిక్ ఉత్పత్తులను అందించాలన్న మా నిబద్ధతకు నిదర్శనం. మిడ్‌ఎస్ యువి విభాగంలో దీర్ఘకాలంగా బెంచ్‌మార్క్‌గా ఉన్న సెల్టోస్ ఇప్పుడు మరింత బోల్డర్, బిగ్గర్ మరియు ప్రోగ్రెసివ్‌గా మారింది. డిజైన్, భద్రత మరియు టెక్నాలజీలో గణనీయమైన పురోగతితో ₹10.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్) ప్రారంభ ధరలో బలమైన విలువను అందిస్తూ కియా బ్రాండ్ లీడర్‌షిప్‌ను మరింత బలోపేతం చేస్తుంది" అన్నారు.

ఇంటీరియర్‌లో, ఆల్‌న్యూ కియా సెల్టోస్ మాస్‌ప్రీమియం పొజిషనింగ్‌ను ప్రతిబింబించే రిఫైన్డ్ మరియు టెక్నాలజీలెడ్ కేబిన్‌ను అందిస్తుంది. 75.18 సెం.మీ (30ఇంచ్) ట్రినిటీ పానోరమిక్ డిస్‌ప్లే ప్యానల్, ప్రీమియం లెదరెట్ అప్హోల్స్టరీ, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, మెమరీ ఫంక్షన్‌తో 10వే పవర్ అడ్జస్టబుల్ డ్రైవర్ సీట్, ప్రీమియం బోస్ 8స్పీకర్ ఆడియో సిస్టమ్, 64కలర్ అంబియెంట్ మూడ్ లైటింగ్ మరియు డ్యూయల్‌పేన్ పానోరమిక్ సన్‌రూఫ్ వంటి ఫీచర్లు రోజువారీ డ్రైవింగ్ అనుభవాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి.

కియా ఇండియ ఆధునిక అనంతపూర్ తయారీ కేంద్రంలో తయారైన ఆల్‌న్యూ కియా సెల్టోస్, వేగంగా పెరుగుతున్న మిడ్ SUV విభాగంలో కియా ఉనికిని మరింత బలపరుస్తూ, భారత మార్కెట్ పట్ల సంస్థ యొక్క దీర్ఘకాలిక నిబద్ధతను మరోసారి చాటుతోంది.

## మాజీ మంత్రులను కలిసిన సర్పంచ్





**విశ్వంభర, మహబూబ్ నగర్ :** మహబూబ్ నగర్ జిల్లా బాలనగర్ మండలం చిన్నరేవల్లి గ్రామ సర్పంచ్ బత్తుల వెంకటరాములుగౌడ్, ఉప సర్పంచ్ మహేంధర్, వార్డు మెంబర్లు మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బి.శంకర్ గౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.





## వృత్తి నైపుణ్యాల ద్వారా దివ్యాంగుల సాధికారత

### 'మానస' లో మానసిక దివ్యాంగ యువతకు తోటపని శిక్షణ ప్రారంభం

**విశ్వంభర, నాగోల్ :** స్వామి వివేకానంద 163వ జయంతి , జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా "వృత్తి నైపుణ్యాల ద్వారా దివ్యాంగుల సాధికారత" అనే అంశం పై మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థలో సెమినార్ కార్యక్రమం జరిగింది. తోటపని లో పాల్గొనటం ద్వారా మానసిక వ్యాంగులలో సైతం ఉల్లాసం ఆత్మనిర్భరత పెరుగుతాయని అతిధిగా హాజరైన సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ నిపుణులు జి. నాగరత్నం నాయుడు పేర్కొన్నారు. తమ కాళ్ళమీద తాము నిలబడేటట్లు చేయటమే విద్య లక్ష్యంగా ఉండాలని స్వామి వివేకానంద పేర్కొనటాన్ని గుర్తు చేసారు. భూమాత వడిలో ప్రకృతితో మమేకం కావటం వల్ల అనేక శారీరక మానసిక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ జనరల్ పి. సదానందం మాట్లాడుతూ మానసిక దివ్యంగులలో ఇంద్రియ నైపుణ్యాలు మెరుగు పరచటం, బాధ్యతా భావం, జట్టు పని పెంపొందించే లక్ష్యంతో మానసలో మొక్కల నర్సరీ ప్రారంభించటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రత్యేక విద్య , ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ మరియు బిహేవియర్ థెరపీ సేవలు అందిస్తున్న మానస వంటి స్వచ్ఛంద సేవా సంస్థలకు చేయూత అందించటం సమాజంలో ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శూన్య టాక్స్ సోలుషన్స్ పార్టనర్ కె. నరసింహా రావు , కార్యక్రమంలో మానస అధ్యక్షులు డాక్టర్ దినేష్ కుమార్, కోశాధికారి సి. వి. సుబ్బా రావు. మానస సిబ్బంది పలువురు స్వచ్ఛంద సేవకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం




**విశ్వంభర, చైతన్యపురి :** జాతీయ రోడ్డు భద్రతా మాసం కార్యక్రమాల్లో భాగంగా సత్యనగర్‌లోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులకు , ప్రజలకు ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించడం, హెల్మెట్లు, సీట్ బెల్ట్‌గలు ధరించడం, పాదచారులు దాటడం నియమాలు, అశాంతిగా డ్రైవింగ్ చేయకుండా ప్రమాదాలను నివారించడం వంటి ముఖ్య రోడ్డు భద్రతా పద్ధతులపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు, ఎస్సైలు భద్రయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.




స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా ఎ. వి కళాశాల లో నిర్వహించిన జాతీయ యువతా దినోత్సవ ఉత్సవాలలో ముఖ్య అతిథి గా మంత్రి వాకా శ్రీహరి , గౌరవ అతిథి గా మధు యష్కిగౌడ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. (విశ్వంభర, హైదరాబాద్)

# బీజేపీ పాలనలో పెరుగుతున్న నిర్బంధం

- ప్రశ్నించే వారి గొంతు నొక్కుతోంది
- వందేళ్ల పోరాట చరిత్ర కమ్యూనిస్టు పార్టీలదే
- ఎవరికి అన్యాయం జరిగినా వారి పక్షాన ఆందోళన చేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**విశ్వంభర, ఖమ్మం :** బిజెపి పాలనలో దేశ వ్యాప్తంగా నిర్బంధం పెరుగుతోందని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బూటకపు ఎన్ కౌంటర్ల పేరుతో ఒక పక్క మావోయిస్టులను హతమారుస్తూ.. మరో పక్క ప్రశ్నించే వారిని అర్బన్ నక్సల్స్ పేరుతో నిర్బంధాలకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే కూనంనేని ఆరోపించారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కడం ద్వారా అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని బిజెపి భావిస్తుందని ఎమ్మెల్యే సాంబశివరావు విమర్శలు గుప్పించారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడారు. వందేళ్ల పోరాట చరిత్ర కమ్యూనిస్టు పార్టీలకు తప్ప ఏ పార్టీకీ లేదన్నారు. దేశంలో రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులతో పాటు ఇప్పటి సాఫ్ట్ వేర్ ఇంజినీర్లతో సహా ఎవరికి అన్యాయం జరిగినా వారి పక్షాన ఆందోళన చేపట్టేది కమ్యూనిస్టులేనన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని.. పెట్టుబడిదారి దేశం అమెరికా నడిబొడ్డున యువత సోషలిజాన్ని కాంక్షిస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తుందంటే ప్రపంచ ప్రజల్లో వస్తున్న మార్పును గమనించవచ్చని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వివరించారు. భారతదేశంలో సైతం కమ్యూనిస్టుల ఐక్యత పురోగమించవచ్చని చెప్పారు. సీపీఐ పార్టీ వందేళ్ల పోరాట చరితను నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు ప్రజలను సంసిద్ధులను చేసేందుకు జనవరి 18న ఖమ్మంలో చారిత్రిక సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి కూడా హాజరుకానున్నట్టు వివరించారు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు. 20న భారతదేశం వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లు అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తామని.. ఇందులో ప్రధాన వామపక్షాల నేతలు డి.రాజా, ఎంఏ బేబీ, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య, జి.దేవరాజన్ పాల్గొంటారని చెప్పుకొచ్చారు కూనంనేని. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.




డాక్టర్స్ కాలనీ డివిజన్ లో చేపట్టిన ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ వేస్ట్ పరికరాల సేకరణ కార్యక్రమాన్ని డి సి శ్రీనివాసులు, డాక్టర్స్ కాలనీ కాలనీ ప్రధాన కార్యదర్శి వి ఎస్ ఎన్ శ్రీనివాస్ రావు , డి ఈ చందన లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపెర్వైషర్ బుచ్చయ్య, ఎస్ ఎఫ్ ఏ శ్రీనివాస్ , కాలనీ కార్యవర్గం ఉపాధ్యక్షులు వన్నాడీ శ్రీనివాస్, జనార్దన్, దయాకర్, అన్నారెడ్డి, బల్వాంతరావు, అనంతరెడ్డి నరేష్ రాజమౌళి, దశరథ రెడ్డి, సీనియర్ సిటిజెన్ సభ్యులు పాలుగోన్నారు.

(విశ్వంభర, సరూర్ నగర్)